అసోసియేషన్ సమస్యల పరిష్కారానికి కృషి

దిల్‌సుఖ్‌నగర్: పెన్షనర్స్ ఫ్యామిలీ వెల్ఫేర్ అసోసియేషన్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర అధ్యక్షుడు శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి సుభాకర్ రావు, కోశాధికారి యాదగిరిగౌడ్ పేర్కొన్నారు. శనివారం కొత్తపేటలోని బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ ఫ్యామిలీ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 2025–2028 సంవత్సరాలగాను నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న 5 డీఎలు, పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వ జేఏసీ ద్వారా డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. అన్ని ప్రైవేట్ హాస్పిటల్లో హెల్త్ కార్డులపై వైద్యం అందించేలా చూడాలన్నారు. ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి నిరంతరం కృషిచేస్తామన్నారు.

హ్యాండీక్రాఫ్ట్ మేళాకు స్పందన


మేళాలో కొనుగోలుదారుల సందడి

వనస్థలిపురం: వనస్థలిపురంలోని హెచ్‌ఎండీఏ ఆడిటోరియం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళాకు స్పందన వస్తోంది. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్, లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజెస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యూవెలరీ, తదితర ఉత్పత్తులు తగ్గింపు ధరలకు లభిస్తాయని మేళా నిర్వాహకులు అక్బర్ అలీ తెలిపారు.

హైపర్ టెన్షన్‌పై అవగాహన


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

చాదర్‌ఘాట్: ప్రపంచ హైపర్ టెన్షన్ దినోత్సవం సందర్భంగా మలక్‌పేటలోని కేర్ హాస్పిటల్స్‌లో అధిక రక్తపోటుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో పాటు వారి సహాయకులకు ఉచితంగా రక్తపోటు పరీక్షలు నిర్వహించి హైపర్ టెన్షన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీనియర్ జనరల్ ఫిజిషియన్ డాక్టర్ శశాంక్ మాడభూషణ మాట్లాడుతూ.. హైపర్ టెన్షన్ సైలెంట్‌గా ప్రభావం చూపించే వ్యాధి అని నియంత్రన లోపిస్తే గుండె, కిడ్నీ, మెదడు వంటి కీలక అవయవాలను దెబ్బతీస్తుందన్నారు. ప్రతి ఒక్కరు తమ బీపీ స్థాయిని తెలుసుకొని అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

మలక్‌పేట: ప్రభుత్వ పథకాలు అర్హులైన వారందరికి అందేలా కృషి చేస్తానని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. నియోజకవర్గ పరిధిలోని సైదాబాద్, చార్మినార్ మండలాలకు చెందిన 120 మంది లబ్ధిదారులకు మంజూరైన షాదీ ముబారక్ చెక్కులను శనివారం ఆయన పంజేషాలోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులంతా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

3 రవాణా వ్యవస్థల అడ్డా.. నల్గొండ చౌరస్తా!

● ఆకట్టుకునే కళాకృతులు ● సమీపంలోనే ప్రముఖ మార్కెట్, రైల్వే స్టేషన్, ప్రభుత్వాసుపత్రి


ట్రాఫిక్ జాంతో నిత్యం రద్దీగా ఉండే జాతీయ రహదారి


మూడు రవాణా వ్యవస్థల కూడలిగా నల్గొండ చౌరస్తా

చాదర్‌ఘాట్: నగర ప్రజలకు పరిచయం అవసరం లేని ప్రాంతం నల్గొండ చౌరస్తా. నగరం నుంచి శివారు ప్రాంతాలు, ఇతర రాష్ట్రాలు, జిల్లాలకు వెళ్లాలంటే నల్గొండ చౌరస్తా మీదుగానే వెళ్లాలి. నిత్యం అత్యంత రద్దీగా ఉండే ఈ చౌరస్తా పరిసరాల్లో పేరొందిన కార్యాలయాలు, పార్కులు, పురాతన కట్టడాలు ఉండటమే కాకుండా భిన్న ప్రాముఖ్యతలు ఉన్న అరుదైన మూడు రవాణా వ్యవస్థల చౌరస్తాగా రూపాంతరం చెందింది. గతంలో నల్గొండ చౌరస్తా అత్యంత రద్దీగా ఉండేది. ఇక్కడ ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించడానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఫ్లై ఓవర్ నిర్మించి ఆయన చేతుల మీదుగానే ప్రారంభించారు. అనంతరం నగరంలో మెట్రో రైలు కోసం ఇక్కడి ఫ్లై ఓవర్ పై నుంచి మెట్రో నిర్మాణం జరిగింది. కింద ప్రధాన రహదారి, దానిపై ఫ్లై ఓవర్, ఆపైన మెట్రో నిర్మాణంతో ఈ చౌరస్తాలో మూడు రవాణ వ్యవస్థలకు అడ్డాగా మారింది.

- నల్గొండ చౌరస్తా సుందరీకరణ పనుల్లో భాగంగా ఇక్కడ ఏర్పాటు చేసిన కళాకృతులు రహదారి గుండా ప్రయాణించే వారిని ఆకట్టుకుంటాయి.
- ఇక్కడ ఫ్లై ఓవర్ కింది భాగంలోనే ఆహ్లాదం అందించే జాతీయ వికలాంగుల పార్కును ఏర్పాటు చేశారు.
- ఇక్కడికి సమీపంలోనే మలక్‌పేట రైల్వే స్టేషన్ ఉంది.
- చౌరస్తాకు అత్యంత సమీపంలోనే మలక్‌పేట ఏరియా ఆసుపత్రి ఉంది.
- నగరంలోనే అతి పెద్ద మార్కెట్లలో ఒకటైన మలక్‌పేట మార్కెట్ చౌరస్తాకు ఆనుకొని ఉంటుంది.
- మార్కెట్‌కు వెనుక వైపు నిజాం కాలంలో నిర్మించిన మహబూబ్ మాన్షన్ ఉంటుంది. మాన్షన్‌కు వెళ్లే మార్గంలో అప్పటి దర్వాజాలు, మరి కొన్ని పురాతన నిర్మాణాలు అటుగా వెళ్లే వారికి ఇట్టే ఆకర్షిస్తాయి.


చౌరస్తాలోని దివ్యాంగుల జాతీయ పార్కు


చౌరస్తా సమీపంలోని మలక్‌పేట మార్కెట్

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

● ప్రతిరోజు 19 ఎంజీడీ నీరు సరఫరా ● వేగంగా పూడికతీత పనులు
● సాక్షితో ఎల్‌బీనగర్ వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి



ఎల్‌బీనగర్: వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకున్నామని ఎల్‌బీనగర్ డివిజన్ వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ప్రతి రోజు 18 ఎంజీడీ నీటిని సరఫరా చేయాల్సి ఉండగా వేసవిలో నీటి ఎద్దడిని నివారించేందుకు అదనంగా మరో 1ఎంజీడీ నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని డ్రైనేజీలు పొంగకుండా ఇప్పటి నుంచే పూడిక తీత పనులు చేపట్టామని వెల్లడించారు. తాగునీటి కోసం తీసుకుంటున్న చర్యల గురించి ఆయన సాక్షికి వివరించారు.

ప్రశ్న: వేసవిలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: వేసివిలో బోర్లు ఎండిపాయి నీటి ఎద్దడి తీవ్రంగా ఉండేది. ముందే ఈ విషయాన్ని గ్రహించి ప్రతి రోజు 18 ఎంజీడీ నీటి సరఫరా ఉండేది. తాగునీటి ఎద్దడి రాకుండా అదనంగా మరో 1 ఎంజీడీని సరఫరా చేస్తూ ఎక్కడా తాగునీటి సమస్య రాని వ్వడం లేదు.

ప్రశ్న: ప్రస్తుతం డివిజన్ పరిధిలో ఎంత మంది వినియోగదారులు ఉన్నారు.. ఎంత మందికి ఉచిత నీటి సరఫరా చేస్తున్నారు?

జవాబు: డివిజన్ పరిధిలో ఆటోనగర్, ఎల్‌బీనగర్, మన్సూరాబాద్, నాగోలు, ఎన్జీవోస్ కాలనీ, బీఎన్‌రెడ్డినగర్, కమలానగర్, వనస్థలిపురం సెక్షన్ పరిధిలో 60వేల మంది వినియోగదారులు ఉన్నారు. ఇందులో 30 వేల మంది వినియోగదారులకు ఉచితంగా మంచినీటి సరఫరా చేయడంతో వారికి జీరో బిల్లులు వస్తున్నాయి. మరో 30 వేల మందికి బిల్లులు వసూలు చేయడంతో రూ.1.80కోట్ల ఆదాయం వస్తుంది.

ప్రశ్న: పలు కాలనీల్లో తరుచూ డ్రైనేజీలు పొంగడంతో రహదారులు,కాలనీలు దుర్గంధంగా మరుతున్నాయి. వీటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: డివిజన్ పరిధి 8 సెక్షన్ల పరిధిలో సుమారుగా 12,726 మ్యాన్‌హోళ్లు ఉన్నాయి. వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే మ్యాన్‌హోల్స్ నుంచి పూడికతీత పనులు చేపట్టాం. ఇప్పటి వరకు 189.57లెంత్ వరకు పూడిక తీత పనులు చేపట్టి 214.57 టన్నుల వ్యర్థాలను తొలగించాం. దీంతో మ్యాన్‌హోళ్లు పొంగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: శివారు కాలనీల్లో తాగునీటి సౌకర్యం నీటిని కొనుగోలు చేస్తున్నారు. దీనిపై మీ స్పందన?

జవాబు: కొత్త కాలనీలో మంచినీటి పైప్‌లైన్లు లేకపోవడం నీటిని కొనుక్కుని తాగుతున్న మాట వాస్తమే. ఇందుకు అన్ని కాలనీలకు మంచినీటి పైప్‌లైన్ల వేసి తాగునీటి సమస్య తీర్చేందుకు పైప్‌లైన్ల నిర్మాణం కోసం అంచనాలు తయారు చేసి బడ్జెట్ ఆమోదం కోసం పంపిన్నాం. నిధులు మంజూరు కాగానే శివారు కాలనీల్లో దహర్తి తీర్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం.

నేటినుంచి బాలల సాయిశిబిరం

చైతన్యపురి: చిన్నారులలో భక్తి భావం, మనోవికాసానికి తోడ్పడాలనే ఉద్దేశంతో దిల్‌సుఖ్ నగర్‌లోని సాయిబాబా ఆలయంలో ఆదివారం నుంచి బాలలసాయి శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ బీవీ శ్యాంకుమార్ తెలిపారు. సాయంత్రం 5నుంచి 7గంటల వరకు శిక్షణా తరగతులు ఉంటాయిని వచ్చే నెల ఒకటో తేదీ వరకు నిర్వహించే శిబిరంలో 15 సంవత్సరాలలోపు బాల బాలికలు పాల్గొనవచ్చన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుడు కన్నుమూత


మన్నె గోపాల్‌రెడ్డి (ఫైల్)

వనస్థలిపురం: స్వాతంత్య్ర సమరయోధుడు మన్నె గోపాల్‌రెడ్డి (99) శనివారం పరమపదించారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండలం గుడిమల్కాపూర్‌కు చెందిన గోపాల్‌రెడ్డి వనస్థలిపురం ద్వారకామయినగర్‌లో నివాసం ఉంటున్నారు. స్వాతంత్రోద్యమంలో ఆయన చురుకుగా పాల్గొన్నారని, ఆదివారం ఉదయం సాహెబ్‌నగర్ శ్మశానవాటికలో ఆయన అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ట్రంక్‌లైన్ డ్రైనేజీ నిర్మాణానికి సహకరించాలి


రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ బృందావన్ మేడోస్ కాలనీలో నిర్మించే ట్రంక్‌లైన్ డ్రైనేజీ నిర్మాణానికి రైతులు సహకరించాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. బృందావన్ మేడోస్ కాలనీలో నూతనంగా నిర్మించే ట్రంక్‌లైన్ డ్రైనేజీని స్థానికంగా ఉండే రైతులు అడ్డుకోవడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో అధికారులు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి ఫిర్యాదు చేయడంతో రైతులతో సమావేశం నిర్వహించి వారితో చర్చించి భరోసా కల్పించారు. కాలనీ అధ్యక్షులు శశికాంత్ కావాలనే తాము చేస్తున్న లేఅవుట్‌పై అధికారులకు ఫిర్యాదు చేశారని, తాము ట్రంక్‌లైన్ డ్రైనేజీ నిర్మాణానికి భూములు ఇచ్చామని, ఇబ్బందులు పెడుతున్న శశికాంత్‌పై ఎమ్మెల్యేకు రైతులు ఫిర్యాదు చేశారు. భూములు ఇచ్చిన రైతులు అధికారులకు సహకరించాలని, ఇబ్బందులు ఉంటే తాను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో అరవిందొరెడ్డి, యాదిరెడ్డి, చంద్రారెడ్డి, మనోజ్‌గౌరిశెట్టి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి


అవగాహన కల్పిస్తున్న రవాణాశాఖ అధికారులు

నాగోలు: ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు చెందిన బస్సులు ఫిట్‌నెస్ ఉండాలని రవాణాశాఖ అధికారులు సూచిస్తున్నారు. రాష్ట్ర జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, కార్యదర్శి సి రమేష్ ఆదేశాల మేరకు శనివారం మలక్‌పేట ఆర్టీఓ ఎల్. కిష్టయ్య ఆధ్వర్యంలో నాగోలులోని ఈస్ట్ జోన్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల వాహనాల డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ కిష్టయ్య మాట్లాడుతూ.. ఫిట్‌నెస్ లేకుండా వాహనాలను నడిపేతే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనం నడుపుతున్నప్పుడు ఫోన్‌లో మాట్లాడారాదన్నారు. ఈ కార్యక్రమంలో బలరాం, రమేష్‌బాబు, నరేందర్, పాల్ సింగ్, రాధిక పాల్గొన్నారు.




క్రిస్టియన్ కాలనీ అభివృద్ధికి కృషి

వనస్థలిపురం: క్రిస్టియన్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని క్రిస్టియన్ కాలనీలో వారు పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు నాలా పనులు పూర్తిచేసి తమకు వరదనీటి సమస్యను పరిష్కరించిన మధుయాష్కీగౌడ్, కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డికు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కాలనీలోని అంతర్గత రోడ్లు, ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, నాయకులు కంచర్ల కవిత, కిరణ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి..

హస్తినాపురం: ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని మధుయాష్కీ గౌడ్ అన్నారు. హస్తినాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దెంది శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో మధుయాష్కీగౌడ్ పర్యటించి స్థానికులతో మాట్లాడారు. వరదనీటి కాలువ పనులను వర్షాకాలంలోపు పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు .ఈ కార్యక్రమంలో దుర్గయ్యగౌడ్, అమర్‌నాథ్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



భారత పరాక్రమానికి ప్రతీక 'ఆపరేషన్ సిందూర్'


ర్యాలీగా తరలివెళ్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్


తిరంగా యాత్ర ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

నాగోలు: చలోట్యాంక్ బండ్ కార్యక్రమానికి సిటిజన్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్, నాగోలు డివిజన్ అధ్యక్షులు పంగ శ్రీకాంత్ ఆధ్వర్యంలో శనివారం బీజేపీ నాయకులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. భారత పరాక్రమానికి ప్రతీక 'ఆపరేషన్ సిందూర్' వీర విజయాన్ని స్మరించుకోవాలన్నారు. టూ మన సైనికుల వీరత్వం, త్యాగాన్ని స్మరించుకోవాలన్నారు.

ఎల్ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దులచ్చిరెడ్డి ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీకి బీజేపీ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్‌ను స్మరించుకుంటూ మన సైనికుల వీరత్వం త్యాగాన్ని స్మరించుకుంటూ సిటిజన్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ గౌరవార్థం తిరంగా యాత్ర చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రావు, నవకిశోర్‌రెడ్డి, శంకరయ్యగౌడ్, రఘురాంనేత, శరత్‌కుమార్, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కొత్తపేట నుంచి..

నాగోలు: బీజేపీ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తిరంగా ర్యాలీకి కొత్తపేట డివిజన్ నుంచి కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ ఆధ్వర్యంలో భారీగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

చైతన్యపురి: బీజేపీ రాష్ట్ర నాయకుడు శ్రీకాంత్, రంగారెడ్డి జిల్లా బీజేపీ కౌన్సిల్ సభ్యుడు సుమన్‌గౌడ్ ఆధ్వర్యంలో తిరంగా యాత్రకు తరలివెళ్లారు.ఈ కార్యక్రమంలో కృష్ణప్రకాష్, పర్లశివ, రామ్మోహన్, వెంకటేశ్, భానుప్రసాద్, తిరుమలగౌడ్, రవి, అర్జున్ సింగ్, అమూల్య రెడ్డి, భార్గవ్, చింటు, సందీప్ పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ స్ఫూర్తిదాయకం

సైదాబాద్: ఆపరేషన్ సిందూర్ స్ఫూర్తిదాయకవిజయమని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి అన్నారు. వినయ్‌నగర్ కాలనీ కమ్యూనిటీహాల్లో నిర్వహించిన తిరంగా యాత్ర సన్నాహక సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా దేశం మన త్రివిధ దళాల గొప్పతనాన్ని చాటిందన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయోత్సవం పురస్కరించుకొని నిర్వహిస్తున్న తిరంగా ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జంగం మధుకర్‌రెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, వీరేంద్రబాబు యాదవ్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలి

సైదాబాద్: బస్తీలు, మురికివాడల్లో నివసించే చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు తల్లిదండ్రులు ప్రాధాన్యమివ్వాలని సేఫ్ ఫౌండేషన్ నిర్వాహకురాలు సుజాత సూరేపల్లి సూచించారు. శనివారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోహిణి ఫౌండేషన్ సహకారంతో ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీలో చిన్నారుల కోసం వైద్య శిబిరం ఏర్పాటు చేసి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా సుజాత సూరేపల్లి మాట్లాడుతూ.. చిన్నారులకు తరచూ వైద్య పరీక్షలు చేయించాలన్నారు.


చిన్నారులతో ఫౌండేషన్ ప్రతినిధులు

అన్నదమ్ముల అదృశ్యం


హబిబుల్లా, సఫియుల్లా

హయత్‌నగర్: ఇద్దరు మైనర్లు అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..బిహార్‌కు చెందిన మహ్మద్ ఇజ్రయిల్ కొడుకులు హబిబుల్లా(13), సఫియుల్లా(11) కుంట్లూర్ హత్తిగూడలోని మిస్బాహుల్ హుడా రహిమియా మదర్సాలో చదువుతున్నారు. గత నెలలో సొంతూరుకి వెళ్లి ఈ నెల 6 తండ్రి తీసుకుని వచ్చి మదర్సాలో వదిలి వెళ్లాడు. ఈ నెల 8న ఉదయం ఎవరికీ చెప్పకుండా అన్నదమ్ములిద్దరూ మదర్సా నుంచి బయటికి వెళ్లారు. చుట్టు పక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో ఇజ్రయిల్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మలక్‌పేటలోని ప్రొస్పెరా కియా షోరూమ్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో కియా కారెన్స్ క్లావిస్ వాహనాన్ని నటి పాయల్ రాజ్‌పుత్, కియా ప్రతినిధి సిరాజ్ బాబుఖాన్‌తో కలిసి ఆవిష్కరించారు.
– మలక్‌పేట



సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515
9912220363
9912220365